# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త






## తుడ పరిధిలో అభివృద్ధి, ప్రణాళికలపై ఢిల్లీలో చర్చ



తిరుపతి, అక్టోబర్ 9 ప్రభాతవార్త: తుడ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్తు ప్రణాళికలపై ,అంతర్జాతీయ నిధుల సమీకరణపై న్యూఢిల్లీలో చర్చ జరిగింది. అక్కడ జరిగిన ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ సౌత్ ఆసియా డిపార్మెంట్ ప్రాజెక్ట్ అధికారి ప్రత్యూష్‌కాంత్‌ను తుడ ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి కలిశారు. ఎడిబి ద్వారా ఆర్థిక సాయం, సాంకేతిక అవసరాలందించే మార్గాలపై సానుకూల చర్చ సాగింది. తుడ ఛేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అభినందిస్తూ అవసరమైన సహాకారం అందిస్తామని హామీ ఇచ్చారని తుడ ఛైర్మన్ తెలిపారు. అక్కడే మాజీ రాజ్యసభసభ్యురాలు గుండు సుధారాణితో భేటీ అయ్యారు.

## కాణిపాకం ఆలయానికి 1.80 లక్షలు విరాళం

కాణిపాకం, అక్టోబర్ 9 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానంలో అమలవుతున్న వివిధ అభివృద్ధి పథకాలకు భక్తుడు గురువారం 1.80 లక్షలు రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు విజయ వాడకు చెందిన తెలుగు ఆర్ట్స్ యూత్ శ్రీసాయి అనే భక్తుడు శాశ్వత నిత్యాన్నదాన పథకానికి 80 వేల రూపాయలు, శ్రీసిద్ధి వినాయక గోసంర క్షణ ట్రస్ట్‌కు లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమొతాన్ని దాతలు కుటుంబసభ్యులతో కలసి ఆలయ సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, చిట్టిబాబులకు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు.

### పరిశుభ్రతతో

## సీజనల్ వ్యాధులు కట్

### జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి కలెక్టరేట్, అక్టోబర్ 9 ప్రభాతవార్త : పరిసరాల పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులను నాశనం చేయవచ్చునని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ తెలియజేశారు. గురువారం ఉదయం స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు ఆర్‌డిఓ లు, మున్సిపల్ కమిషనర్ లు, ఎంపీడీవోలు, ఈ ఓ పి ఆర్ డి లు, పిహెచ్ సి, సిహెచ్‌సి, ఏరియా ఆసుపత్రుల సూపెరింటెం డెంట్‌లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎ ఈ, డి డి, ఈ ఈ, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ లు, సానిటరీ సెక్రటరీ, వార్డు సెక్రటరీ, పంచాయతీ సెక్రటరీ, వసతి గృహాల వార్డెన్లతో జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గడిచిన సంవత్సరంలో కొన్ని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలోని పిల్లలు వాంతులు, విరోచనాల బారిన పడ్డారని తెలిపారు. ఆ సంఘటనలు దృష్టిలో ఉంచుకొని మళ్ళీ పునరావృతం కాకుండా అన్ని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలు, ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్ పాఠశాలలో పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు పట్ల ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ నివారణకు ప్రజలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిపిఓ సుశీల దేవి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి విక్రమ్ కుమార్ రెడ్డి, డి.ఈ ఓ కెవి ఎన్ కుమార్, డిఎంహెచ్ ఓ బాల కృష్ణ నాయక్, అంబేద్కర్ గురుకుల పాటశాల జిల్లా సమన్వయకర్త పద్మజ సంబందిత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పెరిగిపోతున్న రౌడీయిజం



ప్రభాతవార్త–తిరుపతి: యాత్రాస్థలం,ఆధ్యాత్మికనగరంలో రౌడీయిజం పెరిగిపోతోంది. ముఖ్యంగా యువత మద్యం మత్తులో ఎవరిని ఎందుకు అటకాయించి దాడికి పాల్పడుతున్నారనేది పోలీసులు కఠినంగా వ్యవహరించలేకపోతుండటంతో నగరజనం, యాత్రికులు భయంతో వణికిపోతున్నారు. గత వారంరోజుల్లో ఘటనలు పరిశీలిస్తే కొర్లగుంటలో యువకులు కొందరు అదే ప్రాంతానికి చెందిన వారిపై మద్యం మత్తులో దాడిచేశారు. ఈ సంఘటన జనంలో హడలెత్తించింది. తాజాగా బుధవారం రాత్రి ఎస్టీవినగర్ ప్రాంతంలో కొందరు యుకులు కత్తి చేతబట్టుకుని హల్‌చల్ చేశారు. ఇందిరానగర్‌లో ఏకంగా ఓ యువకుడిపై అదే ప్రాంతానికి చెందిన కొందరు యువకులు దాడికి దిగి భయాందోళనకు గురిచేశారు. ఐదురోజుల క్రిందట ఏకంగా నగరం పరిసరాల్లో సాయంత్రం వేళ ఒకేసారి ఐదు ప్రాంతాల్లో మహిళల మెడల్లో బంగారు చైన్‌లు లాక్కెళ్ళారు. వారిని ఇప్పటివరకు పోలీసులు పట్టుకోలేకపోవడం విశేషం. ప్రశాంతమైన తిరుపతి నగరంలో అలజడి సృష్టిస్తున్న

### భయపడుతున్న జనం

వారిని పట్టుకుని పోలీసులు కఠినంగా వ్యవహరించలేకపోతున్నారనే అపవాదు వినిపిస్తోంది. ముఖ్యంగా నగరంలోని అనేక ప్రాంతాల్లో మద్యం మత్తులో యువకులు దాడులకు పాల్పడటం, హత్యాయత్నాలకు దిగడం వంటివి పెరిగిపోతున్నాయి. నగరంలో నిత్యం రద్దీగా ఉండే ఆర్టీసి బస్టాండు, రైల్వేస్టేషన్, గ్రావ్ ధి యేటర్స్ ప్రాంతం, కొర్లగుంటజంక్షన్, పాతమున్సిపల్‌కార్యాలయం, గిరిపురం, డిఆర్‌మహల్‌రోడ్డు, ఎస్టీవినగర్ జంక్షన్, లీలామహల్‌కూడలి,లక్ష్మీపురంకూడలి ఇలా పలుప్రాంతాల్లో యువకులు మద్యం మత్తులో విచ్చలవిడిగా చెలరేగిపోతూన్నారనేది నగరవాసుల్లో ఆందోళన, సాయంత్రం వేళల్లో పోలీసులు విజుబుల్ పోలీసింగ్ లేకపోవడం, ఆయా ప్రాంతాలపై పోలీస్ బ్లూకోల్ట్స్, పెట్రోలింగ్ తిరుగుతూ రౌడీమూకలపై, ఆకతాయిలపై లాఠీ ఝుళిపించకపోతుండటంతో పోలీసుల భయం లేకపోతోందనే విమర్శలు బలంగా ఉన్నాయి. తిరుపతి నగరం, రూరల్ సబ్‌డివిజన్‌లలోని కొందరు సిఐలు ఇవేమీ పట్టించుకోకుండా ఇతరత్రా విషయాలపై ఆసక్తిచూపుతున్నారనే ఆరోపణలు పోలీసుశాఖలోనే గుప్పుమంటోంది. సాయంత్రం వేళల్లోనే నగరంలో పరిస్థితి ఇలా ఉంటేరాత్రి 10గంటలు దాటితే పోలీసులు లాఠీలు ఝుళిపించాలని నగరవాసులు కోరుతున్నారు. యాత్రికులకు తగిన రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది.

### చైనా దేశస్థుడి నివాసంలో

## ఈడి ఆకస్మిక తనిఖీలు



ఈడి అధికారులు దాడులు చేస్తున్న ఇల్లు

రేణిగుంట అక్టోబర్ 9 ప్రభాతవార్త

రేణిగుంట మండలం గురవరాజు సమీపంలోని జాతీయ రహదారి పక్కన ఓ చైనా దేశస్థుడు నివాసముంటున్న ఇంటి నందు ఈడి అధికారులు బుధవారం నుండి తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈడి అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారనే విషయం మండలంలో సంచలనం రేపుతుంది. సదరు చైనా దేశస్థునిపై 2021 సంవత్సరం రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ నందు అనేక కేసులు నమోదు అయ్యాయి అనేది జగమెరిగిన సత్యం. ప్రస్తుతం ఆ కేసులకు సంబంధించిన విచారణ కోర్టులో జరుగుతున్నట్లు సమాచారం. అతని వీసా కూడా సీజ్ చేసినట్లు తెలిసింది. రేణిగుంట పారిశ్రామిక వాడలో పలు చైనా కంపెనీలు ఉండడం కంపెనీలో పనిచేసే చైనా దేశస్తులకు ఆహారం సరఫరా కోసం క్యాంటీన్ నిర్వహిస్తున్నాడని జనం చెప్పుకున్నారు. నేపథ్యంలో ఈడి అధికారులు దాడులు నిర్వహించడం సర్వత్ర చర్చినీయాశం అయింది. గురువారం రాత్రి వరకు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. దాడులు జరుగుతున్న విషయాన్ని అధికారులు ఎవరు ధ్రువీకరించడం లేదు

## నిండుకుండలను తలపిస్తున్న చెరువులు



పాకాల, అక్టోబర్ 9, ప్రభాతవార్త

వార్త దినపత్రికలో వచ్చిన వరుస కథనాలకు స్పందించిన మైనర్ ఇరిగేషన్ శాఖ. పాకాల మండలం ఉప్పరపల్లె పంచాయతీ పరిధిలో మల్లెల చెరువు, తడకర చెరువులు రెండు అలుగులు పారుతున్నాయి దామలచెరువు మీదుగా ప్రవహించే పెద్దవంక నుంచి ఎన్టీఆర్ సప్లై ఛానల్ ద్వారా ఇరిగేషన్ అధికారులు ప్రస్తుతం చెరువులు నింపడంతో తటాకాలు జలసిరులతో తొనికిసలాడుతున్న ఆ నిండు చెరువులను చూసి కూటమి పాలనపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షపు నీటిని వృధాగా కిందికి పోనివ్వకుండా నీటిని ఒడిసి పట్టే ప్రయత్నంలో ఇరిగేషన్ డిఈ చొరవ అభినందనీయం అని స్థానిక పంచాయతీ ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇంకా రామన్న చెరువు మిగిలి ఉన్నప్పటికీ నీటి ప్రవాహ వేగం సుమారుగా ఉండటం వలన తొందరలో ఆ చెరువు కూడా నిండే అవకాశం ఉంది. కనుక ఇరిగేషన్ అధికారులు ప్రవాహాన్ని ఇలాగే కొనసాగించాలి అని ప్రజలు కోరుతున్నాను. కాలువ పూడికను జేసిబి సహాయంతో ఎప్పటి కప్పుడు తొలగించడంలో స్పందించిన వేదగిరి రఘునాథ నాయుడును ఈ సందర్భంగా పంచాయతీ ప్రజలందరూ కూడా అభినందిస్తున్నారు. నీటిపారుదల శాఖ వారు శాశ్వతంగా కాలవ పై సిమెంట్ లైనింగ్ పనులు చేపట్టి ఎన్టీఆర్ సప్లై ఛానల్ బలోపేతం చేయవలసినదిగా మెజారిటీ ప్రజలు కోరుతున్నారు.

### తిరుపతి జిల్లా సంయుక్త కలెక్టర్

## శుభంబన్సల్ బదిలీ

### -తడ విసి కుర్చీ ఖాళీ



తిరుపతి,అక్టోబర్ 9ప్రభాతవార్త: తిరుపతి జిల్లా సంయుక్తకలెక్టర్, తుడ విసి శభంబన్సల్ బదిలీ అయ్యారు.ఆయన్ను తిరుపతి జిల్లా నుండి పరిశ్రమలశాఖ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. గురువారం సాయంత్రం జరిగిన ఐఎఎస్ అధికారుల బదిలీల్లో తిరుపతి సంయుక్తకలెక్టర్ బదిలీ అనివార్యమైంది. 2024 జూలై 24వతేదీ తిరుపతి జెసిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటినుండి ఆయన కలెక్టర్ సూచనలతో ఆయన అడుగుజాడల్లో నడుస్తూ యువకుడిగా, మంచి అధికారిగా పేరుగడించారు. ఇటీవల ఆయన తుడ విసిగా అదనపు బాధ్యతలు చేపట్టారు. తక్కువ కాలంలోనే సూరప్పకశం లేఔట్ విక్రయాలు, తుడ టవర్ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించారు. అయితే తుడ పరిధిలో కొంత ముక్కుసూటి తనంగా వ్యవహరించడమే ఈ బదిలీకి కారణంగా తెలుస్తోంది. తిరుపతి జెసిగా తదుపరి ఎవరికి అవకాశం లభిస్తుందో .

## వర్షించిన వరుణుడు -జోరువానతో అవస్థలు



తిరుమల,అక్టోబర్ 9ప్రభాతవార్తప్రతినిధి: అల్పపీడనం ప్రభావంతో గురువారం ఉదయం అర్థగంట భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా కురిసిన వర్షంతో తిరుమల ఆలయం ముందు, మాఢవీధులు వర్షపునీటితో నిండిపోయాయి. భారీ వర్షంతో తిరుమల పూర్తిగా వాతావరణం మారిపోయింది. ఉదయం 11గంటల నుండి 11.40గంటల మధ్యజోరువాన కురిసింది. ఆలయంలోనికి వెళ్ళే భక్తులు వర్షానికి తడుస్తూ స్వామివారి దర్శనానికి చేరుకోవాల్సి వచ్చింది. చల్లటిగాలులు వీస్తున్నాయి.

### మరుగుదొడ్డిలో పడి

## విద్యార్థికి తీవ్ర గాయాలు



చౌడేపల్లి, అక్టోబర్ 9 ప్రభాతవార్త

దైవకార్యం చూసేందుకు మరుగుదొడ్డి ఎక్కిన విద్యార్థి కిందకు పడటంతో తీవ్ర గాయాలపాలైన సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. ఎస్ఐ నాగేశ్వరరావు కథనం మేరకు...మండలంలోని దుర్గసముద్రం పంచాయతీ బుటకపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రదీప్(10) విద్యనభ్యసిస్తున్నాడు. పాఠశాలకు పక్కనే దైవకార్యం జరుగుతోంది. విద్యార్థి దాన్ని చూసేందుకు పాఠశాలలోని మరుగుదొడ్డికి అమర్చిన పింగాణిపైకి ఎక్కి చూడసాగాడు. ప్రమాదవశాత్తు అది పగిలి పోవడంతో కిందకు పడ్డాడు. పింగాణికున్న పలక విద్యార్థి కడుపుకు కుచ్చుకోవడంతో పేగు బయటకు వచ్చేసింది. గుర్తించిన చుట్టుపక్కల వారు బాలుడుని మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమచికిత్సానంతరం వైద్యులు తిరుపతి రుయాకు సిఫారస్సు చేసారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

## భేదం లేని సమాజమే కాన్షీరామ్ ధ్యేయం బీఎస్పీ నేత శ్రీనివాసులు



పుంగనూరు అక్టోబర్ 9 ప్రభాతవార్త

భారతదేశాన్ని కులమత వర్గ బేధం లేకుండా చూడాలని బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్సిరాం కలలు కన్నారని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ సీనియర్ న్యాయవాది శ్రీనివాసులు అన్నారు. కాన్షీరాం వర్ధంతి సందర్భంగా స్థానిక అంబేద్కర్ గ్రహం వద్ద కాన్షిరాం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. బి.ఎస్.పి నాయకులు ఈ శ్రీనివాసులు కాన్షిరామ్ కలల కన్నా సమాజం ఒక్క రోజుకు ఏర్పడుతుందని, ఆయన ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో.బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు అంజప్ప, కార్యదర్శి బాలసుబ్రమణ్యం, జె .వి.నాగరాజా, కమ్మి రెడ్డప్ప,కృష్ణప్ప, తదితరులు పాల్గొన్నారు.

### ఇందిరానగర్‌లో

## యువకుడిపై దాడి



తిరుపతి,అక్టోబర్ 9ప్రభాతవార్త: తిరుపతి ఇందిరానగర్‌లో టిడిపి నేత మనవడు ఉమామహేశ్వర్‌పై ప్రత్యర్థులు కర్రలు,రాడ్లతో దాడిచేసినట్లు ఈస్టు పోలీసులకు పిర్యాదు అందింది. వైసిపికి చెందిన గాంధీపురం వాసులు నల్లానిబాబు, బన్నీ, భరత్, కె.మహేశ్, నల్లాని మురుగేశ్ కర్రలతో దాడిచేసి తీవ్రంగా కొట్టారు. దీంతో అతని పరిస్థితి తీవ్రంగా ఉండటంతో రూయాకు తరలించారు. అడ్డొచ్చిన వాళ్ళను కూడా దారుణంగా కొట్టారని పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈస్టు పోలీసులు కేసు నమోదు చేసి విచారణచేస్తున్నారు.

## ఆర్థిక సంక్షోభంలో శ్రీకాళహస్తి మున్సిపాలిటీ

### పేరుకుపోయిన పాత బకాయిలు: అభివృద్ధి ప్రశ్నార్థకం: చెల్లింపుల కోసం కాంట్రాక్టర్ల ప్రదక్షిణలు

శ్రీకాళహస్తి,అక్టోబర్ 9 ప్రభాతవార్త

పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తి మున్సిపాలిటి స్థాయి పెరిగింది కానీ ఆదాయ వనరులు పెరగలేదు. ప్రభుత్వం నుంచి చిల్లి గవ్వ నిధుల్లేకుండా అభివృద్ధికి ఆమడదూరంలో కొట్టుమిట్టాడుతుంది. అభివృద్ధి పనులకు సంబంధించి ఎన్ని సార్లు టెండర్లు పిలుస్తున్నా కాంట్రాక్టర్లు ముందుకు రావటం లేదు. పనులు చేసిన కాంట్రాక్టర్లు చెల్లింపుల కోసం మున్సిపల్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. స మాధానం చెప్పలేక అధికారులు ముఖం చాటేసే పరిస్థితి చోటు చేసుకుంది. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటిలకు ఎన్నికలు జరుగుతున్నాయి. పాలకమండళ్ళు వస్తున్నాయి. అయితే శ్రీకాళహస్తి మున్సిపాలిటికి కేసుల మీద కేసులు కోర్టుల్లోల్లో నడుస్తున్నాయి. హైకోర్టులో పరిష్కరిద్దామంటే సుప్రీం కోర్టులో మరో కేసు నడుస్తుంది. దాంతో ఇప్పటిలో శ్రీకాళహస్తి మున్సిపాలిటికి ఎన్నికలు జరిగే పరిస్థితి కనబటం లేదు.కొత్త ప్రభుత్వం వచ్చి ఏడాది న్నర దాటినా కోర్టు కేసులు పరిష్కారం కావటం లేదు. ఎన్నికలకు అధికారులు అన్ని సిద్దంగా ఉంచుకున్నా ప్రయోజనం లేని దుస్థితి.

**పాత బిల్లుల చెల్లింపుల ఊసే లేదు:**

శ్రీకాళహస్తి పురపాలకసంఘంలో చేసిన పనులకు సంబంధించిన బిల్లులు ఏళ్ళ తరబడి చెల్లింపులు చేయక బకాయిలు తడిసి మోపెడయ్యాయి. ఇప్పటి వరకు మున్సిపాలిటి ఎంత బకాయి ఉన్నది తేలలేదు.ఈ చెల్లింపులకు సంబంధించి బిల్లుల చెల్లింపుకు ప్రభుత్వం వద్ద కునుకు తీస్తున్నట్లు సమాచారం. అయితే రాబోవు మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులకు నిధులు కోరుతుంటే 'సాధారణ నిధుల' నుంచి చేసుకోమని ఉన్నతాధికారుల నుంచి సమాధానం వస్తున్నట్లు సమాచారం. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం.ఇక్కడి ఆలయానికి దేశ విదేశాల నుంచి అతిధులు వస్తుంటారు. ఇంటి అభివృద్ధి వాకిలి చూస్తే చాలంటారు.

**దేవస్థానం ఆదుకోవాలి! నాయకుడు ప్రయత్నించాలి!!**

శ్రీకాళహస్తి అభివృద్ధి ఇటు మున్సిపాలిటి అటు దేవస్థానం మీద ఆధారపడి ఉంది. తిరుపతి అభివృద్ధికి ఎలా తిరుమలేశుని నిధులు వెచ్చిస్తున్నారో అలాగే శ్రీకాళహస్తి అభివృద్ధిలో దేవస్థానంను బాగస్వామ్యం చేయాలి. ఎంతో కాలంగా పట్టణాభివృద్ధిలో భాగంగా దేవస్థానం కరెంటు బిల్లులు,



శ్రీకాళహస్తి పట్టణం విహంగ వీక్షణం

నాలుగుమాడావీధులు, రైల్వే స్టేషన్, ఆర్‌టిసి బస్టాండు వరకు పర్యవేక్షణ దేవస్థానం తీసుకోవాలని ఖర్చులు భరించాలనే డిమాండ్ ఉంది. గత ప్రభుత్వ హాయాం నుంచి కోరుతున్నారు. అయితే దేవస్థానం గతంలో చెల్లిస్తున్న కార్‌పార్కింగ్ వాటా కూడా ఇవ్వటం లేదు. ఇక అభివృద్ధికి సంబంధించి నాయకుడు స్థానిక అధికారులపై వత్తిడి తీసుకురావటం కన్నా ప్రభుత్వంతో పోరాడి పుణ్యక్షేత్రానికి నిధులు తీసుకురావాల్సి ఉంది. అభివృద్ధికి సాధారణ నిధులు వాడుకోమంటున్న ఉన్నతాధికారులతో చర్చించాల్సి ఉంది. పుణ్యక్షేత్రం కాబట్టి ప్రత్యేక నిధుల కోసం ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలి. మన ప్రభుత్వమే కదా అనుకుంటే పప్పులో కాలేసినట్లే.ప్రకటనలతో పరిపాలన అభివృద్ధి సాధ్యం కాదు. ప్రభుత్వం వద్దకు పలుమార్లు వెళ్ళాలి నిధుల సాధనకు కూర్చొని సాధించుకోవాల్సి ఉంది.

## జేశాప్ రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీ విజేత చిత్తూరు జట్టు

### - రన్నర్ అప్‌గా నిలిచిన తూర్పు గోదావరి జిల్లా

తిరుపతి క్రీడ, అక్టోబర్ 9, ప్రభాతవార్త:





రాష్ట్రస్థాయి జర్నలిస్టు లీగ్ పోటీలలో తిరుపతి (చిత్తూరు ఉమ్మడి) జిల్లా జట్టు విజేతగా నిలిచింది. అనంతపురం జిల్లా ఆర్డిటి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా నాలుగు రోజులపాటు జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జేశాప్) ఆధ్వర్యంలో మొదటి సారిగా ఎంతో ప్రతిష్టాత్మకంగా జర్నలిస్ట్ ప్రీమియర్ లీగ్ 2025 పోటీలు నిర్వహించారు. ఇది వరకు నాకౌట్ పద్ధతిలో జేశాప్ క్రికెట్ పోటీలను నిర్వహించగా, రాష్ట్రంలోనే 13 జిల్లాల నుంచి జర్నలిస్టులు పాల్గొని, ఆడిన ఒక్క మ్యాచ్ లో ఓడిపోతే నిరాశతో వెను తిరిగి వెళ్లిపోయే వారిని గుర్తు చేశారు. అయితే ఈసారి టోర్నమెంటులో పాల్గొన్న ప్రతి జట్టు మూడు మ్యాచ్లు ఆడాలన్న మంచి ఉద్దేశంతో అనంతపురంలోని ఆర్డిటి క్రీడ మైదానంలో మొట్టమొదటిసారిగా లీగ్ పద్ధతి ద్వారా టోర్నీ నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఇందులో పాల్గొన్న తిరుపతి జట్టు మొదటి మ్యాచ్ నుంచి గొప్పగా రాణిస్తూ చాంపియన్గా నిలవడం గొప్ప విషయం అన్నారు. బుధవారం ఉదయం జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్ లో నెల్లూరు జట్టుతో తలపబడగా, ముందు టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 100 పరుగులు చేసిందన్నారు. అనంతరం బ్యాటింగ్కు దిగిన ఉమ్మడి తిరుపతి చిత్తూరు జట్టు 11.1 ఓవర్లలో 103 పరుగులు చేసి విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుందన్నారు. ఈ కార్యక్రమంలో జేశాప్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, ఉపాధ్యక్షులు వెంకటరెడ్డి, బాలచంద్ర, కార్యదర్శి జగదీష్, జిల్లా అధ్యక్షులు కోనంకి రవితేజ, కమిటీ సభ్యులు కుళ్లాయప్ప, దండు శివప్రసాద్, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు విజయకుమార్, ప్రధాన కార్యదర్శి నారా హరిబాబు, చిత్తూరు జిల్లా జట్టు కెప్టెన్ శ్రీనివాసులు, జిల్లా క్రీడాకారులు సీనయ్య, చిన్నబాబు, కామేశ్వరయ్య, వెంకటేష్, జగదీష్, మనోహర్, నరేష్, మునిశేఖర్, సుబ్రహ్మణ్యం, మదిఅలగన్, తుకారాం, శ్రీనివాసులు, సతీష్, సురేష్, హేమంత్ సాయి, సంతోష్, వెంకట్ కుమార్, ఈస్ట్ గోదావరి జట్టు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై వైద్యశాలలో ప్రచారం

సదుం అక్టోబర్ 9 ప్రభాతవార్త



సదంలోని కమ్యూనిటీ హెల్త్ హాస్పిటల్ లో గురువారం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పథకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాధా రాణి మాట్లాడుతూ కేంద్రంలోని కూటమి ప్రభుత్వం జీఎస్టీ స్లాబుల్లో సవరణ తేవడం ద్వారా ప్రజలకు ఎంతో మేలు చేసిందన్నారు. స్వదేశీ వస్తువుల వినియోగం పెంచేలా భారీగా పన్నులు తగ్గించిందన్నారు. ప్రభుత్వానికి నష్టం వచ్చిన ప్రజలకు ఆర్థికంగా లాభం చేకూరుతుందన్నారు .ఈ కార్యక్రమంలో వైద్యశాల సూపరిండెంట్ రాజు, వైద్యాధికారి పుష్పలత ,వైద్యశాల చైర్మన్ కృష్ణారెడ్డి, సభ్యులు మురళీధర్, రమామహేశ్వరి, డిప్యూటీ ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు, వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం వైద్యశాలలో దసరా పండుగ నిర్వహించి ఆయుధ పూజ చేశారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి రూ.2.10 లక్షలు జరిమానా

**చిత్తూరు, అక్టోబర్ 9 ప్రభాతవార్త:** చిత్తూరు నగర పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడిన ద్విచక్రవాహనదారులకు గురువారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రవేశపెట్టగా ఆమె నిందితులు ఒక్కొక్కరికి 10 వేల రూపాయలు చెప్పున 21 మందికి రూ.2.10 లక్షలు జరిమానా విధించారు. చిత్తూరు ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో బుధవారం చిత్తూరుఉ నగర పరిధిలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 21 మంది పట్టుకున్నారు. వీరిని గురువారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎదుట హాజరుపరిస్తే ఆమె ఒక్కొక్కరికి 10 వేల రూపాయలు చెప్పున జరిమానా విధించారు. ఈ మేరకు ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ చిత్తూరు నగర పరిధిలో ట్రాఫిక్ ఉల్లంఘనలకు ఎవరైనా పాల్పడితే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## టపాసుల కోసం పోలీసుల వేట

– చిత్తూరులో విస్తృతంగా టపాకాయల గోడౌన్లు, దుకాణాలు తనిఖీలు

చిత్తూరు, అక్టోబర్ 9 ప్రభాతవార్త:



దీపావళి పండుగ సమీపిస్తుండటంతో పోలీసులు అనుమతులు లేని టపాకాయల నిల్వలపై పూర్తి నిఘా కేంద్రీకరించారు. చిత్తూరు నగర పరిధిలోని టపాసుల గోడౌన్లు, చిత్తూరు నగర పరిధిలోని టపాకాయల విక్రయ దుకాణాలను గురువారం వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్, టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్యల నేతృత్వంలో పోలీసులు జల్లెడ పట్టారు. ఈ సందర్భంగా పోలీసులకు ఎక్కడా అనుమతులు లేని టపాకాయలు పట్టుబడకపోయినప్పటికీ దీపావళి పురస్కరించుకుని అనుమతులు లేని చోట్ల ఎక్కడైనా టపాకాయలు నిల్వ వుంచిన వారికి ఈ తనిఖీలతో గుబులు బయలుదేరింది. చిత్తూర బజారు వీధిలోని అయ్యప్ప టపాకాయల దుకాణం, పాకాల శెట్టి టపాకాయల దుకాణం, సత్య టపాకాయల దుకాణం, ఎస్‌సికె ట్రేడర్స్, సెల్వం టపాకాయల దుకాణాలను పోలీసులు తనిఖీ చేశారు. చిత్తూరు అర్బన్ తహసిల్దారు, రెవెన్యూ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

## సమాజ శ్రేయస్సుకు మానసిక ఆరోగ్యం పునాది

– అపోలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ వినోద్‌భట్



**చిత్తూరు, అక్టోబర్ 9 ప్రభాతవార:** మానసిక అనారోగ్యం అనేది క్లిష్టమైనదని, సమాజ శ్రేయస్సుకు మానసిక ఆరోగ్యం పునాది లాంటిదని అపోలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ వినోద్‌భట్ పేర్కొన్నారు. అపోలో యూనివర్సిటీలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవంను పురస్కరించుకుని గత ఐదు రోజులుగా అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్‌లో సైకియాట్రి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు గురువారం ముగిసాయి. ఈ ముగింపు కార్యక్రమానికి హాజరైన వైస్ ఛాన్సలర్ డాక్టర్ వినోద్‌భట్ మాట్లాడుతూ మానసిక స్థితిని బాధితుల దగ్గరి వారు సైతం గుర్తించడంలో విఫలమవుతారన్నారు. మానసిక ఆరోగ్యం ఒక వ్యక్తి సమస్య మాత్రమే కాదని, అది కుటుంబం మొత్తంను ప్రభావితం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ రమ్యా రామకృష్ణన్, సైకియాట్రి విభాగం ప్రొఫెసర్ డాక్టర్ దినేష్, సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ భాస్కర్‌నాయుడు, అధ్యాపకులు, స్కూల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్, మెడికల్, పారా మెడికల్ అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కడ పి.డి.ని సత్కరించిన ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల

కుప్పం, అక్టోబర్ 9 ప్రభాతవార్త



ప్రభుత్వ విప్, కడ పిఎసి చైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ గురువారం కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్‌ను ఘనంగా సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛాంధ్ర 2025 అవార్డుల్లో కుప్పం కడ కార్యాలయంకు స్వచ్ఛ కార్యాలయం కేటగిరీలో అవార్డు రావడంతో సిఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా కడ పి.డి. అవార్డు అందుకున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల కడ పి.డి.ని సత్కరించారు. మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాకీర్, సీనియర్ నేత ఫైరోజ్, మాజీ ఎంపిటిసి ఉమాపతి పాల్గొన్నారు.

## దుకాణాల్లో మున్సిపల్ అధికారుల 'ప్లాస్టిక్' తనిఖీలు

కుప్పం, అక్టోబర్ 9 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పాన్ని స్వచ్ఛ కుప్పం చేయాలనే ఆశయంతో కుప్పం మున్సిపల్ పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను కమీషనర్ శ్రీనివా సరావు నిషేధించారు. ఈ నేపథ్యంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను హోటళ్లు, దుకాణాలు, వ్యాపారులు వినియోగించరా దని కోరారు. అయితే ఇంకా పలువురు వ్యాపారులు ప్లాస్టిక్ వాడుతుండడంతో మున్సిపల్ అధికారుల బృందం పట్టణంలోని దుకాణాల్లో తనిఖీలు చేపడుతోంది. దుకాణాలు, హోటళ్లలో ఉన్న ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుని జరిమానా విధిస్తున్నారు. ప్రజలు కూడా ప్లాస్టిక్ వాడకం నిషేధానికి సహకరించాలని కమీషనర్ శ్రీనివాసరావు కోరారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

కుప్పం,అక్టోబర్ 9 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు ఆదేశానుసారం కుప్పం మున్సిపాలిటీలో సీజనల్ వా ్యధులు,జ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మురుగునీరు నిల్వ లేకుండా కాలువలు, ఎప్పటికప్పుడు పట్టణంలో చెత ్త,చెదారాలు తొలగిస్తున్నట్లు తెలిపారు. దోమల సంతతి పెరగకుండా కాలువల్లో బ్లీచింగ్ చల్లడంతో పాటు మలాథియాన్ పిచికారీ చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇళ్ల వద్ద కాలువల్లో మురుగునీరు నిల్వ లేకుండా సహకరించాలని కోరారు.

## కాణిపాకం ఆలయ బోర్డు సభ్యులుగా నరేష్..వసంతమ్మ



**కుప్పం, అక్టోబర్ 9 ప్రభాతవార్త** జిల్లాలో ప్రసిద్ధి చెందిన కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయ బోర్డుసభ్యులను ప్రభుత్వం నియమిం చింది. కుప్పంకు చెందిన జనసేన నియోజకవర ్గ ఇన్‌చార్జ్ డా॥ బివి నరేష్, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు వసంతమ్మలకు బోర్డు సభ్యులుగా స్థానం లభించింది. కూటమి ప్రభు త్వంలో భాగస్వామిగా ఉన్న జనసేన తరపున బివి నరేష్‌కు అవకాశం కల్పించారు. ఇక పార్టీలో సీనియర్ నాయకురాలిగా ఉన్న వసంతమ్మకు తగు స్థానాన్ని సిఎం చంద్రబాబు కల్పించారు.వీరి నియామకంపై కూటమి నేతలు హర్షం తెలిపారు.

## రేపటి నుంచి పాఠశాలల్లో భోధనేతర పనులు బహిష్కరణ



పెద్దపంజాణి, అక్టోబర్ 9 ప్రభాతవార్త ప్రభుత్వ పాఠశాలల్లో రేపటి నుంచి బోధనేతర పనులను బహిష్కరిస్తున్నట్లు పెద్దపంజాణి మండల విద్యాశాఖ అధికారులకు ఫ్యాప్టో నాయకులు మొమరాండం అందజేశారు. రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు 10వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బోధనేతర పనుల బహిష్కరణ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవలకాలంలో పాఠశాలల్లో ప్రభుత్వ అమలుచేస్తున్న రకరకాల యాప్స్ వంటి కార్యక్రమాల వల్ల పాఠశాలల్లో పిల్లలకు సరైన విద్యా అందించలేకపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

## గ్రామ ఉద్యాన సహాయకులు దినేష్ పై క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు

కల్లూరు, అక్టోబర్ 9, ప్రభాతవార్త పులిచెర్ల మండలం కమ్మపల్లి రైతు భరోసా కేంద్రం గ్రామ ఉద్యాన సహాయకుడు దినేష్ (ఇటీవల జరిగిన బదిలీల్లో పెనుమూరు మండలానికి బదిలీ అయ్యారు) పై క్రమశిక్షణ చర్యలకు వ్యవసాయ శాఖ అధికారులు సంబంధిత శాఖ ఉత్తర్వులు జారీ చేశారు. గత మే నెలలో పంపిణీ చేసిన రాయితీ వేరుశనగ విత్తనాల సొమ్ము రూ.2,14,500 చెల్లించని కారణంగా క్రమశిక్షణ చర్యలకు సిఫారసు చేశారు. అలాగే పుంగనూరు మండలం వనమల దినేష్, ఏఈఓ శివ శంకరప్ప రూ. 6,33,343, సదుం మండలం నడిగడ్డ గ్రామ పట్టు పరిశ్రమ శాఖ సహాయకురాలు ఎలిజిబెత్ రాణి రూ 3,11,899, సోమల మండలం పెద్ద ఉప్పరపల్లి గ్రామ వ్యవసాయ సహాయకుడు నవీన్ రూ. 3,84,380 సొమ్ము చెల్లించలేదు. క్రమశిక్షణ చర్యలకు సిఫారసు చేసినట్టు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు.

## న్యాయమూర్తిపై దాడి రాజ్యాంగానికే చేటు

–ప్రజాసంఘాల నిరసన



చౌడేపల్లి, అక్టోబర్ 9 ప్రభాతవార్త సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై దాడి రాజ్యాంగానికే చేటని సిఐటియు, కులవివక్ష పోరాట సంఘం నాయకులు డాక్టర్ చంద్ర, వాసులు అన్నారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తి గొగోయ్‌పై న్యాయవాది రాకేష్ కిషోర్ బూటుతో వేయడం పట్ల స్థానిక బస్టాండులో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన, ర్యాలీ, తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రాన్నందించారు. రాజ్యాంగాన్న పరిరక్షించే న్యాయమూర్తికే రక్షణ లేకుంటే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. న్యాయవాదిపై చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ డిటి రామ్మూర్తికి వినతి పత్రాన్నందించారు. నాయకులు బ్యాంకు రెడ్డెప్ప, కృష్ణమూర్తి, బస్టాండు శేఖర్, శ్రీరాములు, శేఖర్, పొదపల్లి రమణ, శెట్టిపేట శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

## ట్రైనీ ఎస్ఐగా మణికంటేశ్వరరెడ్డి

చౌడేపల్లి, అక్టోబర్ 9 ప్రభాతవార్త

చౌడేపల్లి ట్రైనీ ఎస్ఐగా మణికంటేశ్వరరెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు ఆయన గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలానికి చెందిన ఆయన 2024లో జరిగిన సెలక్షన్‌లో ఎస్ఐగా ఎన్నిక కాబడ్డాడు. ప్రస్తుతం పుంగనూరు రూరల్ సిఐ రాంభూపాల్, ఎస్ఐ నాగేశ్వరరావు పర్యవేక్షణలో ట్రైనీ ఎస్‌గా నెలరోజులపాటు విధులు నిర్వర్తించనున్నారు. కాగా బిటెక్ చదివిన మణికంటేశ్వరరెడ్డి 2018లో కనిస్టేబుల్‌గా పనిచేసిన అనుభవం వుంది.

## ఆడపిల్లలకు అవగాహన కార్యక్రమం

పలమనేరు టౌన్, అక్టోబర్ 9, ప్రభాతవార్త:



పలమనేరు జనవిజ్ఞాన వేదిక, జిల్లా సమతా విభాగం ఆధ్వర్యంలో గురు వారం స్థానిక ఎపి బాలికల గురు కుల పాఠశాలలో అడపిల్లలకు అవ గాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సమతా విభాగం కన్వీనర్ పాపుదేశి జయంతి మాట్లాడుతూ ఆడపిల్లలు పెరిగే వయసులో తమ శరీరంలో ప్రకృతి సిద్ధమైన సహజ మార్పులు చూసి అందోళన చెందవద్దని ఇందుకు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు సహకరించాలని సూచించారు. అడపిల్లలు మహిళగా మార్పు చెందే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బాహ్య ప్రలోభాలకు లొంగవద్దని కేవలం చదువుపైనే దృష్టి సారించి తమ భవిష్యత్తు బంగారు మయం చేసుకోవాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి, సంఘ సేవకుడు శ్రీపురం సీతారామయ్య, జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు అరుణ్ శివప్రసాద్, ప్రధాన కార్యదర్శి యుగంధర్, కోశాధికారి గిరిధర్‌మూర్తి, పర్యావరణ కమిటీ కన్వీనర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మిథున్‌రెడ్డిని కలిసిన హేమంత్‌కుమార్‌రెడ్డి

పలమనేరు, అక్టోబర్ 9, ప్రభాతవార్త:



మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుమారుడు, రాజంపేట ఎంపి మిధు న్‌రెడ్డిని పలమనేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, పలమనేరు పట్టణ వైసిపి కన్వీనర్ హేమంత్‌కుమార్‌రెడ్డి, పెద్దపంజాణి వైసిపి నాయకుడు మంజునాథరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం ఢిల్లీలో మిధున్‌రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి క్షేమ సమాచారాలు అడిగి తెలుకున్నారు.

## రాష్ట్ర బార్ కౌన్సిల్ దృష్టికి న్యాయవాదుల సమస్యలు

పలమనేరు, అక్టోబర్ 9, ప్రభాతవార్త:



న్యాయవాదుల ఎదుర్కొం టున్న సమస్య లను పల మనేరు న్యాయవాదులు గురువారం రాష్ట్ర బార్ కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ ఎన్. ద్వారకనాథరెడ్డి పలమనేరు బార్ కౌన్సిల్‌కు విచ్చేయడంతో తమ సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా ద్వారకనాథరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 1 నుండి న్యాయవాదులకు అదనంగా డెత్ బెన్‌ఫిట్స్, మెడికల్ బెన్‌ఫిట్స్ అందే విధంగా కృషి చేశానని తెలిపారు. న్యాయవాదులు మాట్లాడుతూ తమకు ఇళ్ళ స్థలాలు కేటాయించాలని, గౌరవ హైకోర్టు సమీపంలో ఒక అతిథి గృహం నిర్మించి రాష్ట్ర వ్యాప్తంగా హైకోర్టుకు వెళ్ళే న్యాయవాదులకు తక్కువ అద్దెతో గదులు కేటాయించాలని. 30 ఏళ్ళు ప్రాక్టీసు పూర్తి చేసుకున్న న్యాయవాదులకు సగం వెల్‌ఫేర్ ఫండ్ అందే విధంగా చర్యలు తీసుకోవాలని మిగిలిన సగం వెల్‌ఫేర్ ఫండ్‌ను సదరు న్యాయవాది మృతి అనంతరం కుటుంబ సభ్యులకు అందించాలని కోరారు. అలాగే బార్ కౌన్సిల్ జమాలెక్కలు ప్రతి బార్ అసోసియేషన్‌కు సమాచారం అందించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెగ్యులర్‌గా కోర్టులకు హాజరు కాని, ప్రాక్టీసు చేయని న్యాయవాదులను వెల్‌ఫేర్ ఫండ్ జాబితా నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్‌ను ఘనంగా సత్కరించారు. పలమనేరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్ భాస్కర్, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, షరీఫ్, జాయింట్ సెక్రటరీ ఫామిద్, న్యాయవాదులు రంజితషా, పరమశివప్ప, కె.లక్ష్మీపతి, వికె హరూన్, మోహన్‌రెడ్డి, రెడ్డెప్పశెట్టి, రాజారెడ్డి, కృష్ణమూర్తి లక్ష్మణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకం ఆలయానికి మోటారు సైకిల్ విరాళం

కాణిపాకం, అక్టోబర్ 9 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంకు ఓ భక్తుడు మోటారు సైకిల్‌ను విరాళంగా అందజేశారు. ఈమేరకు తవణంపల్లె మండలం అరగొండకు చెందిన శ్రీవెంకటేశ్వర ఇవి బైక్స్ అధినేత ప్రకాష్ అనే భక్తుడు సుమారు 50 వేల రూపాయలు విలువగల ఎలక్ట్రికల్ బైక్‌ను ఆలయానికి విరాళంగా అందజేశారు. ఈబైక్ ను ఆలయ ఈఓ కార్యాలయంలో ఈఓ కె.పెంచల కిషోర్‌కు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్లు కోదండపాణి, వాసు, తదితరులు పాల్గొన్నారు.

## అర్ధగిరి హుండీల ద్వారా 17.35 లక్షలు ఆదాయం

తవణంపల్లె, అక్టోబర్ 9 ప్రభాతవార్త:



ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధ గిరి శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంకు హుండీ లెక్కింపు ద్వారా 17.35 లక్షలు రూపా యలు ఆదాయంగా లభిం చింది. గురువారం ఆలయ ఈఓ ఇ.మునిశేఖర్, ఆధ్వ ర్యంలో అరగొండ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు వారిచే హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈసందర్భంగా 122 రోజులకు గాను 17.35,350 రూపాయలు ఆదాయంగా వచ్చింది. అలాగే మూడున్నర గ్రాముల బంగారు, 102 గ్రాముల వెండి ఆదాయంగా వచ్చింది. లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ఈఓ ఇ.మునిశేఖర్, దేవాదాయశాఖ కార్యాలయ ఇన ్స్పెక్టర్ ఎస్.శ్వేత, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ పీఎం ఉమామహేష్, స్థానిక నాయకులు రంజిత్‌రెడ్డి, రఘుపతి, అర్చకులు, ఆలయ, బ్యాంక్ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా ముసిన అథ్లెటిక్స్ పోటీలు

**సదుం అక్టోబర్ 9 ప్రభాతవార్త** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు పలమనేరు డివిజన్ స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. దాదాపు 300 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలో 14 నుంచి 17 సంవత్సరాల లోపు ఉన్న విద్యార్థులకు వివిధ రకాల ఆటలు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం ప్రారంభించగా వివిధ పాఠశాలల పీడీలు పీఈటీలో అథ్లెటిక్స్‌ను నిర్వహించారు. ఇక్కడ ప్రథమ ద్వితీయ స్థానాల్లో వచ్చిన విద్యార్థులు చిత్తూరు లో జరిగే జిల్లాస్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొంటారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ కోఆర్డినేటర్ శశి ప్రకాష్, అసోసియేషన్ సెక్రటరీ నూరుద్దీన్, స్థానిక పాఠశాల పీడీలు భాస్కర్, నౌషద్ ఆలీ, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## బాధిత రైతుకు రెస్కోతరపున ఆర్ధికసాయం

కుప్పం,అక్టోబర్ 9 ప్రభాతవార్త



శాంతిపురం మండలం 64పెద్దూరుకు చెందిన ఓ రైతుయొక్క పాడి ఆవు విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. దీంతో ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ ఆదేశాలతో గురువారం రెస్కోఛైర్మన్ ప్రతాప్‌కుమార్, రెస్కో ఎండి సోమశేఖర్, రెస్కో డైరెక్టర్లు బాధిత రైతుకు రెస్కో తరపున అరవై వేలు ఆర్థికసాయంను చెక్కు రూపంలో అందించారు. కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారా , రెస్కో డైరెక్టర్లు శివ, అమీర్,అనసూయ, ఎంపిటిసి నామాలప్ప,చంద్ర పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## చిత్తూరులో వైసిపి మహిళల ఆగ్రహం

– కల్తీ మద్యంను అరికట్టాలంటూ రోడ్డెక్కిన మహిళలు

చిత్తూరురూరల్, అక్టోబరు 9 ప్రభాతవార్త:



చిత్తూరు పట్టణంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం గురువారం కల్తీ మద్యం అరికట్టాలంటూ చిత్తూరు ఎక్సైజ్ అర్బన్ స్టేషన్ ఎదుట పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. కల్తీ మద్యంతో ప్రాణాలు తీస్తున్న కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సిపి మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ మద్యం బాటిళ్లను పగలకొట్టారు. కల్తీ మద్యం, నారా వారి సారా అరికట్టాలి, బెల్టు షాపులను తొలగించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నకిలీ లిక్కర్ కేసులో వున్న కూటమి నేతల్ని ప్రభుత్వం వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేసారు. అంతకు ముందు జిల్లా కోర్టు నుండి అర్బన్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంజలిరెడ్డి, గాయత్రిదేవి, హరిణిరెడ్డి, లీనరెడ్డి, హరిషా రెడ్డి, కౌసర్, పుంగుడి, బిందు, శాంతి, విజయశాంతి, లత, సృజన, భాగ్యలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మండల సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించిన సభ్యులు

– నిధుల వినియోగంలో వివక్షపై సర్పంచుల ఆగ్రహం

వి.కోట, అక్టోబర్ 9 ప్రభాతవార్త

సమస ్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల సర్వసభ్య సమావేశాన్ని సభ్యులు బహిష్కరించారు.గురువారం ఎంపిపి యువరాజ్ అధ్యక్షతన వి.కోట మండల మీట్ మొదలైంది. ఆయన మాట్లాడుతూ మండలంలోని పలుపంచాయతీల్లో నిధులున్నా కొంతమంది కూటమి నేతల ఆదేశాలతో సర ్పంచులకు బిల్లులను కార్యదర్శులు చెల్లించడం లేదని మండిపడ్డారు. సర్పంచులుచెప్పిన పనులుకాదని నేతలుచెప్పేవిధంగా నడుచుకుంటున్న కార్యదర్శులు ప్రజలకు ఎలా న్యాయం చేస్తారని ప్రశ్నించారు. కార్యదర్శులు పంచాయతీల్లో అందుబాటులో ఉండాలన్న నిబంధనలు పాటించడం లేదన్నారు. కడతనాయనపల్లి గ్రామంలో రైతులు పంట పొలాలకు వెళ్లేదారిని నేతల ఒత్తిడితో మూసేశారని దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తహశీల్దార్ సెలవుపై ఉండడంతో ఎవర్ని అడగాలని ప్రశ్నించారు. గ్రామాల్లో మురుగునీరు రోడ్లపై వస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ కార్యదర్శులకు 72గంటల సమయం ఇస్తున్నామని అంతలోగా సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.అనంతరం సమావేశం వాయిదాపడింది. కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకటేశ్వరరావు, ఎంఇఒ చంద్రశేఖర్, వైద్యాధికారి మురళి, ఎఒ అప్పోజి, వివిధ శాఖలఅధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌కు అభినందన

పలమనేరు టౌన్, అక్టోబర్ 9 ప్రభాతవార్త:



రాష్ట్ర స్థాయిలో పలమనేరు మున్సిపాల్టీకి స్వచ్ఛ ఆంధ్ర– స్వర్ణాంధ్ర అవార్డు రావడంతో పలమనేరు పరిరక్షణ సమితి నాయకులు మున్సిపల్ కమీషనర్ కెవి రమణారెడ్డిని అభినం దించారు. గురువారం స్థానిక మున్సి పల్ కార్యాలయంలో కమీష నర్‌ను కలిసి దుశ్శాలువతో సత్కరించారు. మున్సిపాల్టీ అన్ని రంగాల్లో సర్వతో ముఖాభివృద్ధి చెందడం ముఖ్యంగా పారిశుధ్యం అంటువ్యాధుల నిర్మూలన, తాగునీటి సరఫరా, మౌళిక సదుపాయాల కల్పన వంటి కార్యక్రమాలతో పాటు ప్రభుత్వం అమలుచేస్తున్న అన్ని కార్యక్రమాలు సమర్ధవంతంగా ప్రజలకు చేరువ చేస్తూ కమిషనర్ చేసిన కృషి వల్లనే ఈ అవార్డు లభించింది. పలమనేరు మున్సిపాల్టీకి గతంలో రెండు సార్లు రాష్ట్ర స్థాయిలో క్లీన్‌అండ్‌గ్రీన్ అవార్డులు రావడం మళ్ళీ మరోసారి స్వచ్ఛ ఆంధ్ర– స్వర్ణ ఆంధ్ర అవార్డు రావడం ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ఈ అవార్డు అందుకోవడం సంతోషదాయకమని కొనియాడారు. పరిరక్షణ సమితి అధ్యక్షుడు నరసింహులు, కార్యదర్శి పి.నారాయణ, శ్రీపురం సీతారామయ్య, విజయకుమార్, మురళి, వెంకటేశ్వర్లు, దొరస్వామి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## నిరాశ్రయులను ఆదుకోవడం ప్రతి పౌరుని బాధ్యత

– జిల్లా యువజన అధికారి ప్రదీపకుమార్

చిత్తూరురూరల్, అక్టోబరు 9 ప్రభాతవార్త:





నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించి వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై వుందని జిల్లా యువజన అధికారి బి.ప్రదీప్‌కుమార్ పేర్కొన్నారు. నగరపాలకసంస్థ మెప్మా సహకారంతో సపోర్టు సంస్థ నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతి గృహంలో ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవ ముందస్తు సంబరాల్లో భాగంగా ప్రదీప్‌కుమార్ నూతన దుప్పట్లను పంపిణీ చేసారు. నిరాశ్రయులకు వసతి కల్పించి వారికి కుటుంబసభ్యులతో కలసి వుండే ఆహ్లాదాన్ని కల్పిస్తున్న జోసఫ్‌రాజు సేవలు అభినందనీయమని, అలాగే నిరాశ్రయులకు రోజు అవసరాలైన సోపులు, పేస్ట్, బ్రష్, కొబ్బరినూనె, దువ్వెన తదితర వస్తువులను నిత్యం అందజేయడం ప్రశంసనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సపోర్టు సంస్థ నిర్వాహకులు జోసఫ్‌రాజుతో పాటు ప్రాంతీయ గణాంక అధికారి ఎంసి బాబురెడ్డి , వసతిగృహ సిబ్బంది ప్రమీళ, శ్రీజ, శ్రీను, ఇంద్రాణి తదితరులు పాల్గొన్నారు.

## పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు

పూతలపట్టు, అక్టోబర్ 9, ప్రభాతవార్త



మండలంలో రెండు రోజులు అప్పుడ ప్పుడు కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయని, రాక పో కలు నిలిచిపోయాయని ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని తాసిల్దార్ రమేష్ బాబు సూచించారు. అత్యవ సరమైన సందర్భంలో తప్ప బయటకు వెళ్లకండని సూచించారు. మెరుపులు ఉన్న సమయంలో మొబైల్ ఫోన్లో లేదా ఎలక్ట్రానిక్ పరికరాలు ఉపయోగించవద్దు విద్యాసంస్థలు వారు కూడా వర్షపాతం తగిన తర్వాత విద్యార్థులను సురక్షితంగా వారి ఇళ్లకు చేర్చాలని కోరారు. వాగులు వంకలు దగ్గరకు పోకుండా జాగ్రత్తగా ఉండాలని గ్రామాలలో వీఆర్ఓలు తెలియజేయాలన్నారు.

## సహకార బ్యాంకుల ద్వారా గృహ రుణాలు

చౌడేపల్లి, అక్టోబర్ 9 ప్రభాతవార్త





సహకార సంఘాల ద్వారా గృహ రుణాలను అందిస్తున్నట్లు చైర్మన్ పగడాల హరిప్ర సాద్ అన్నారు. స్థానిక కార్యాల యంలో నూత నంగా రైతుల కు మంజూరైన పంటరుణాల చెక్కులందిం చారు. సహకార సంఘాల ద్వారా రైతు లకు విరివిగా రుణాలందిస్తున్నట్లు వివరించారు. స్వల్పకాలిక రుణా లను 7శాతం వడ్డీతో అందిస్తా మన్నారు. అదే విధంగా గృహ రుణాలను 13శాతం వడ్డీతో మంజూరు చేస్తున్నట్లు వివరించారు. ప్రైవేటు కంటే తక్కువ వడ్డీతో పంట రుణాలందిస్తామన్నారు. సహకార సంఘాల ద్వారా రైతులు 2015మార్చి 31లోపు తీసుకొన్న నేటికి వాయిదా మీరి ఎన్‌పిఎలుగా మారి నిల్వ వున్న స్వల్పకాలిక రుణాలకు ఓటీఎస్ ద్వారా చెల్లించుకొనే సదుపాయం కల్పించారన్నారు. అదే విధంగా దీర్ఘకాలిక బకాయిలు చెల్లించినచో అపరాధ వడ్డీ మాఫీ చేయడం జరుగుతుందన్నారు. వివరాలకు స్థానిక సహకార సంఘంలో సంప్రదించాలన్నారు. అనంతరం రూ. 45లక్షల పంట రుణాలందించారు. సిఇఒ మునిరాజ, రైతులు పాల్గొన్నారు.

## నేడు శిల్పారామంలో భారీ ఎగ్జిబిషన్ సేల్

తిరుపతిరూరల్, అక్టోబర్ 9 ప్రభాతవార్త:

తిరుచానూరు రోడ్డులో ఉన్న శిల్పారామంలో శుక్రవారం భారీ ఎగ్జిబిషన్ సేల్ నిర్వహిస్తున్నట్లు కమర్షియల్ టాక్స్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర జిఎస్టీశాఖ, తిరుపతి జిల్లా ఆధ్వర్యంలో వ్యాపార వర్గాల సహకారంతో ఎలక్ట్రానిక్స్, హోమ్ అప్లయేన్స్, టూ వీలర్స్ సేల్స్, సోలార్ పవర్ పానెల్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తగ్గించిన జీఎస్టీ రేట్లు–వినియోగదారులకు అదనపు లాభం, ప్రముఖ కంపెనీల ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు..హోమ్ అప్లయెన్‌సెస్, తాజా మోడల్స్ టూవీలర్స్...ఫోర్ వీలర్స్‌పై ప్రత్యేక ఆఫర్స్‌తో పాటు పండుగ సందర్భంగా ప్రత్యేక డిస్కౌంట్లు...గిఫ్ట్ ఆఫర్లు, ప్రత్యక్ష ప్రదర్శనలు, తక్షణ ఫైనాన్స్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. శిల్పారామంలో ఉదయం 10గంటల నుండి రాత్రి 8గంట వరకు సేల్స్ ఉంటుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ మేరకు నగరపాలక కమీషనర్ మౌర్య, అదనపు కమిషనర్ కాక నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# యువత పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి



గూడూరు, అక్టోబర్ 9 ప్రభాతవార్త: పట్టణంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ వారు స్టార్టప్ ఆలోచనలను స్థిరమైన సంస్థలుగా మారుస్తూ-కొత్త వ్యాపార విప్లవం అంశంపై ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కె.వినయ్ కుమార్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా యువ పారిశ్రామికవేత్తల ఆవిష్కరణలను ప్రోత్సహిస్తూ, స్టార్టప్ ఆలోచనలను స్థిరమైన లాభదాయకమైన సంస్థలుగా తీర్చిదిద్దేందుకు ఒక కొత్త కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమం ద్వారా యువతకు మెంటారింగ్, వ్యాపార ప్రణాళిక (బిజినెస్ ప్లాన్), ఆర్థిక సాయానికి మార్గదర్శకత్వం, మార్కెట్ వ్యూహాలు, సాంకేతిక సహకారం వంటి అంశాల్లో సమగ్ర మద్దతు అందించబడుతుంది. ప్రిన్సిపాల్ డా.వి.రవిప్రసాద్ మాట్లాడుతూ ఇది కేవలం వ్యాపార ప్రాజెక్ట్ కాదు, ఇది ఒక ఆలోచన నుంచి ఆర్థిక శక్తిగా మారే ప్రయాణం. ఈ కార్యక్రమానికి మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు 60 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా. బి.వి.కృష్ణయ్య, కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ డా. దత్తాత్రేయ శర్మ, డీన్ ప్రొఫెసర్ డా.విశ్వక్ సేనరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డా.జెవియస్ భాస్కర్,ఏ.ఓ కొండారెడ్డి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## జగన్మోహన్ రెడ్డి దమ్ముంటే ప్రజల్లోకి రండి! : ఎమ్మెల్యే



వెంకటగిరి, అక్టోబర్ 9 ప్రభాతవార్త: మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజల్లోకి తిరక్కుండా తాడేపల్లిలోని నివాసంలో దాక్కొని ఉన్నాడని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆరోపించారు. కూటమి ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపు పై వెంకటగిరి పట్టణ పురవీధుల్లో ర్యాలీ చేస్తూ కరపత్రాలు పంపిణీ చేసి ఎమ్మెల్యే మాజీ ముఖ్య మంత్రి కూటమి నాయకులు ప్రచారం నిర్వహించారు. ఒక ప్రతిపక్ష నాయకుడు ప్రభుత్వం చేసే తప్పులను ఎత్తిచూపాలే గాని ఇంటిలో దాగి ఉండడం దారుణం అన్నారు. తప్పులు ఎత్తిచూపితే కూటమి నాయకులు స్వాగతిస్తానని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇవ్వని హామీలను కూడా అమలు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పునుగొటి విశ్వనాథం, మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు సత్యనారాయణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేశ్వరరావు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కెవికె ప్రసాద్ నాయుడు, నాయకులు వెంకటముని, మురళీకృష్ణ, నాగరాజు, ఆనంద్, నరసయ్య, నాగరాజు, గల్లా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# రెండు గ్రామాల మధ్య వాగ్వాదం



బాలాయపల్లి, అక్టోబర్ 9 ప్రభాతవార్త: మండలంలోని వెంగమాంబపురం గ్రామ పంచాయతీ నుంచి అక్క సముద్రం గ్రామాన్ని, మరొక పంచాయతీగా చేసేం దుకు గ్రామస్తుల అభిప్రాయం తీసుకో నేందుకు ఏర్పాటు చేసిన గ్రామసభ వాయిదా పడింది. సర్పంచి బి.వెంకట సుబ్బయ్య సభకు హాజరై, అధ్యక్షత వహించకుండానే వెనుదిరిగారు. అక్క సముద్రం,వెంగమాంబపురం ఇరువురి గ్రామస్తుల వాగ్వాదాల మధ్య సర్పంచి బాపనపల్లి వెంకటసుబ్బయ్య, గ్రామసభ నుంచి వెళ్లిపోయారు. సర్పంచి బాపనపల్లి వెంకటసుబ్బయ్య, మాజీ ఏఎంసి చైర్మన్ సిసి నాయుడు గ్రామసభకు హాజరైనా, అక్క సముద్రం, వెంగమాంబపురం ఇరువురి గ్రామస్తుల వాగ్వాదాల మధ్య, తగిన సౌకర్యాలు కల్పించలేదని గ్రామసభ నుండి బాయ్ కాట్ చేశారు. ఇరువురు గ్రామస్తులతో, గ్రామ పెద్దలతో మాట్లాడి త్వరలోనే మరొక నూతన గ్రామసభ తేదీని ప్రకటిస్తామని పంచాయతీ కార్యదర్శి దయాకర్ తెలిపారు. ఈ గ్రామసభలో మహిళా పోలీస్ ఈశ్వరమ్మ, సచివాలయ సిబ్బంది, ఎంపీటీసీ చెముదుగుంట చంద్రమౌళి, మాజీ ఎంపీటీసీ వేముల సుబ్బారావు, మాజీ సర్పంచ్ సాధనాల వెంకమనాయుడు, చెన్నమనేని లక్ష్మయ్య నాయుడు పాల్గొన్నారు.

## సభకు వేలాది మంది తరలిరావాలి

వెంకటగిరి, అక్టోబర్ 9 ప్రభాతవార్త: పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు వెంకటగిరి రూరల్ మండలం పెట్లూరు గ్రామం నందు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్పిఎస్ నేత పల్లిపతి రవి మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ తిరుపతికి విచ్చేసిన సందర్భంగా వెంకటగిరి నియోజవర్గం నుంచి ప్రతి మాదిగ పల్లి నుంచి వందలాదిగా తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఎమ్మార్పీఎస్ నాయకులు, కంటిపల్లి రమణయ్య, నక్కల వేణు, నక్కల గురునాథం, పరుశురాం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమలు ఏర్పాటు చేయించండి



వెంకటగిరి, అక్టోబర్ 9 ప్రభాతవార్త: వెంకటగిరి ప్రాంతంలోని చేనేత కార్మికుల కోసం సంబంధిత పరిశ్రమలు ఏర్పాటు చేయించాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడుకి నియోజకవర్గ బిజెపి ఇన్చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు, నాయకులు వినతిపత్రం అందజేశారు. చేనేత పరిశ్రమకు సంబంధించిన టెక్స్టైల్ పార్కు, తదితర పరిశ్రమలు ఏర్పాటు చేయించాలని కోరారు. చేనేత పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు పాల కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

## ఎంపీడీవోకు ఘన సన్మానం



వాకాడు, అక్టోబర్ 9 ప్రభాతవార్త: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని గురువారం నూతనంగా ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన సాయి ప్రసాద్‌ను వైకాపా మండల కన్వీనర్ సుధాకర్ నాయుడు మర్యాదపూర్వకంగా కలిసి ఎంపిడిఓకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. మండలంలోని పార్టీలకు అతీతంగా పనులు చేయాలని ఎంపీడీవో సాయి ప్రసాదును కోరారు. మండలంలోని పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించుకున్నారు.

## పురోగతి సూచిక అవగాహనపై శిక్షణ



వాకాడు, అక్టోబర్ 9 ప్రభాతవార్త : మండల ప్రజా పరిషత్ కార్యాలయం స్త్రీ శక్తి భవనంలో గురువారం ఎంపీడీవో సాయిప్రసాద్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచులకి ఎంపీటీసీలకు, మండలాధికారులకి పంచాయతీ పురోగతి, సూచిక 2.0పై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ అవగాహన కార్యక్రమంలో ట్రైనర్‌గా జమీన్ కొత్తపాలెం పంచాయతీ కార్యదర్శి చిన్నయ్య వ్యవహరించారు. ఎంపీడీవో యం సాయి ప్రసాద్ మాట్లాడుతూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడపాలని ప్రతి ఒక్క గోల్స్‌ని చేరుకోవాలని. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మహమ్మద్ ఇక్బాల్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సుమాంజలి, గ్రామ సర్పంచులు, నల్లారెడ్డి అనిల్ రెడ్డి, బండి వెంకట రత్నమ్మ, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ జీఎస్టి ఫలాలు : ఎమ్మెల్యే



కోట, అక్టోబర్ 9 ప్రభాతవార్త: సూపర్ జీఎస్టి సూపర్ సేవింగ్స్ పేరిట రాష్ట్రప్రభుత్వం జీఎస్టి ప్రయోజనాలను ఇంటింటికీ తీసుకెళ్లేలా కార్యాచరణ చేపట్టింది. అందులో భాగంగా గురువారం కోటలో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ జీఎస్టి ప్రయోజ నాలపై ప్రజలకు వివరించారు. జీఎస్టి 2.0 సంస్కరణల ప్రయోజనాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అక్టోబర్ 19వ తేదీ వరకు అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఆయన వెంట జిల్లా టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్, సత్యవేడు ఇన్‌ఛార్జ్ శ్రీపతి బాబు, తిరుపతి జిల్లా రైతు విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నెల్లూరు మోహన్‌రెడ్డి, ఎంపిటిసి సభ్యులు సురేష్, షంషుద్దిన్, శ్రీధర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి తిరుమలశెట్టి కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కోట, అక్టోబర్ 9 ప్రభాతవార్త: మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో అన్ని ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాల్లో పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల పట్ల ముందస్తు జాగ్రత్తలు, నివారణకు తీసుకోవాల్సిన అంశాలపై జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ వివరించారు. గురువారం జూమ్ సమావేశం ద్వారా ఎంపిడిఓ, ఆసుపత్రి వైద్యులు, పంచాయతీ కార్యదర్శులు జూమ్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, నీటి సంపులు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి రెండవ శనివారం హెల్త్ చెకప్ కార్యక్రమాన్ని నిర్వహించాలని, తద్వారా పిల్లల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకోవచ్చని తెలిపారు. మంచినీటి పైపులైన్లు లీకేజీ లేకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు చేపట్టాలన్నారు. చేతిబోర్లు, బోర్‌వెల్స్ తనిఖీ చేయడంతో పాటు నీటి నాణ్యత కూడా పరిశీలించాలని కోరారు. జూమ్ సమావేశంలో ఎంపిడిఓ దిలీప్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## చేగువేరా గొప్ప మానవతావాది

గూడూరు, అక్టోబర్ 9 ప్రభాతవార్త: చేగువేరా వర్ధంతి సందర్భంగా గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గుండాల ఆదినారాయణ, దువ్వూరు దిలీప్ రెడ్డి, ఒరేపల్లి బాబు, శేఖర్ రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, జగన్ రెడ్డి, సురేష్ రెడ్డి, తదితరులు, పాల్గొన్నారు.

## గర్భిణీ లకు పౌష్టికాహారం పంపిణీ



గూడూరు, అక్టోబర్ 9 ప్రభాతవార్త : పట్టణంలోని జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గుర్రం విజయ్ బాబు దాతృత్వంలో గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నందు నిరుపేద గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారాన్ని డాక్టర్ రాజా, చలపతి గౌడ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక వారు మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజల్ని చైతన్య పరుస్తూ విద్యార్థులలో సైన్స్ పట్ల అవగాహన కల్పిస్తూ ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయటం చాలా గొప్ప విషయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేవివి అధ్యక్షుడు వేగూరు రాజేంద్ర ప్రసాద్, నాగరాజు, చెంచు నారాయణ, రామమోహన్, సుబ్బారావు, గుర్రం విజయ్ బాబు, అరుణ్ కుమార్, ప్రభాకర్, రజినీకాంత్, ఆనంద్, శ్రీనివాసాచారి, ఇబ్రహీం, సాయి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## నిప్పు పెట్టిన వారిపై చర్యలు తీసుకోండి: ఎమ్మెల్యే



గూడూరు, అక్టోబర్ 9 ప్రభాతవార్త: చిత్తూరు జిల్లాలో అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ గూడూరు పట్టణంలోని స్థానిక టవర్ క్లాక్ సెంటర్ వద్ద ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో దళితులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయ శ్రీ, మాజీ మంత్రి పరసా రత్నం పాల్గొన్నారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ కేవలం దళితులకే కాదు యావత్ భారతానికి నాయకుడన్నారు.అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారి, బాబు, రాజేంద్ర, రఘు, మాల మహానాడు అధ్యక్షుడు రాజా, రమేష్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ ఏసుపాక పెంచలయ్య, అరవ పార్వతయ్య, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల ఎస్సీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ గాయత్రి ఆధ్వర్యంలో విద్యా కిట్స్ పంపిణీ



గూడూరు, అక్టోబర్ 9 ప్రభాతవార్త : పట్టణంలోని సరస్వతి శిశుమందిర్‌లోని 178 మంది విద్యార్థులకి శ్రీగాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి 10వ తరగతి విద్యార్థులు, యాజమాన్యం విద్య కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమములో ఉపాధ్యాయులు మల్లికార్జున్, సుప్రజ, రేవంతి, రజని, మస్తాన్బీ నాసిర, హరిత, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్‌ఓ వాటర్ సిస్టం వితరణ



సూళ్లూరుపేట, అక్టోబర్ 9 ప్రభాతవార్త: సూళ్లూరుపేట రైల్వేగేటు సమీపంలోని ప్రభుత్వ ఎంపీపీ స్కూలులో పిల్లలకు అవసరమైన తాగునీటి ఆర్ఓ సిస్టంను కాసింఖాన్‌కండ్రిగ గ్రామానికి చెందిన శ్రీబాలాజీ రెనిబుల్స్ తిరుపతి వారు మన సంస్థ తరపున వితరణగా అందజేశారు. అలాగే ఆట వస్తువులు వితరణగా అంద జేశారు. ఎంఇఓ సునీల, ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి సంస్థ అధ్యక్షుడు కోగిలి సురేష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు నవులూరు శ్రీనివాసరావు, నారపరెడ్డి ఉదయ్‌కుమార్, వేలూరు మోహన్, పృధ్వి, చిల్లకూరు తేజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రెండు స్కూటర్లు ఢీ



**- యువకుడు మృతి, మరొకరికి గాయాలు**

గూడూరు, అక్టోబర్ 9 ప్రభాతవార్త : మండల పరిధిలోని కాండ్ర, వెందోడు రోడ్డులో ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ కథనం మేరకు బాలాయపల్లి మండలం గొట్టిపాడు గ్రామానికి చెందిన జస్వంత్ (23) అనే యువకుడు గూడూరులోని హెచ్‌డిబి ఫైనాన్స్ కంపెనీలో విధులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో విధుల్లో భాగంగా గూడూరుకు బైక్‌లో వస్తుండగా, అదే మార్గంలో కాండ్ర నుండి వెందోడు వైపు బైక్ పై వెళ్తున్న వ్యక్తి ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో హెచ్ డి బి ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్న యువకుడు జస్వంత్ అక్కడికక్కడే మృతి చెందగా, మరొక వ్యక్తికి గాయాలైన్నారు. గాయపడిన వాడిని చికిత్స నిమిత్తం గూడూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు అన్నారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## ఘనంగా కాన్షిరాం వర్ధంతి వేడుకలు



గూడూరు, అక్టోబర్ 9 ప్రభాతవార్త: బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఏపీ అధ్యక్షుడు గౌతమ్ కుమార్ ఆదేశాల మేరకు కాన్సిరాం 19వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. గూడూరు పెద్ద పోస్ట్ ఆఫీస్ అంబేద్కర్ విగ్రహం వద్ద కార్ స్టాండ్ ఏరియాలో కాన్షిరామ్ వర్ధంతి 19వ సభను బిఎస్పి పార్టీ గూడూరు ఇన్చార్జి ఎల్వి సుబ్బయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గూడూరు పట్టణ బీఎస్పీ పార్టీ అధ్యక్షులు గుంట మడుగు వెంకటేశ్వరరాజు, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి నాసిన భాస్కర్ గౌడ్, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ఆల్ ఇండియా నాయకులు వేగూరు విజయకుమార్, కుంచం వేమయ్యా, గూడూరు నియోజకవర్గ ఇన్చార్జి మీజూరు సుబ్రహ్మణ్యం, ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ నాయకులు వెంకటేశ్వర్లు, పుల్లయ్య, ముస్లిం మైనార్టీ నాయకులు, బిఎస్‌పి పార్టీ నాయకుల తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్, జాయింట్ కలెక్టర్లను కలిసిన యంగ్ ప్రొఫెషనల్స్



బాలాయపల్లి, అక్టోబర్ 9 ప్రభాతవార్త : జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఇటీవల కొత్తగా నియమించబడిన యంగ్ ప్రొఫెషనల్స్ జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే ఏర్పాటు చేసిన ప్రతి సీపీఏపీ యూనిట్‌కు సంబంధించి ఈ యంగ్ ప్రొఫెషనల్స్‌ను నియమించినట్లు తెలిపారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ యంగ్ ప్రొఫెషనల్స్ నియోజక వర్గ ప్రత్యేక అధికారులతో సమన్వయంగా పనిచేసి అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయాలని సూచించారు. చంద్రగిరి నియోజక వర్గంకు నవీన్ కుమార్, తిరుపతి నియోజకవర్గంకు రాజశేఖర్, వెంకటగిరి నియోజకవర్గంకు చెంచయ్య, సూళ్లూరుపేట నియోజకవర్గంకు మురళి, శ్రీకాళహస్తి నియోజకవర్గంకు నాగరాజు గూడూరు నియోజకవర్గంకు వినయ్ కుమార్, సత్యవేడు నియోజకవర్గంకు రాజారాంలను నియమించారు.

## నేటి నుండి బోధనేతర పనులకు ఫుల్‌స్టాప్

చిత్తూరు, అక్టోబర్ 9 ప్రభాతవార్త: ఉపాధ్యాయులు తమ సమస్యల పరిష్కారం కోసం విజయవాడలో ఈ నెల 7వ తేదీ నిర్వహించిన పోరుబాట కార్యక్రమంలో తీసుకున్న నిర్ణయం మేరకు జిల్లాలో శుక్రవారం నుండి ఉపాధ్యాయులు పాఠశాలల్లో బోధనేతర కార్యక్రమాలను బహిష్కరించాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు ఫ్యాప్టో నాయకులు జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నాయకులు మణిగండన్, మునీర్ అహ్మద్‌లు మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు విపరీతమైన బోధనేతర కార్యక్రమాలు వుండటంతో బోధనా సమయం హరించుకుపోతున్నదన్నారు. ఉపాధ్యాయులకు సైతం బోధనపై ఆసక్తి తగ్గిపోయే విధంగా వారికి బోధనేతర కార్యక్రమాలు పెరిగిపోయాయన్నారు. ఈ నెల 7వ తేదీన విజయవాడలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో జరిగిన పోరుబాట కార్యక్రమంలో ఈ నెల 10వ తేదీ నుండి ఉపాధ్యాయులు పాఠశాలల్లో బోధనేతర పనులను నిలుపుదల చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నుండి పాఠశాలల్లో ఉపాధ్యాయులు బోధనేతర కార్యక్రమాలు చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు జివి రమణ, చెంగల్రాయమందడి, ఎన్ఆర్ మదన్‌మోహన్‌రెడ్డి, కిరణ్‌కుమార్, జగదీష్, ప్రభాకర్, సుధాకర్‌రెడ్డి, ఎస్పీ భాషా, సమీర్, ముక్తర‌హమద్, చంద్రన్, చిరంజీవి, సురేష్‌బాబు, గణపతి తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ప్రభుత్వం తరపున సాయం: జిల్లా కలెక్టర్



కుప్పం,అక్టోబర్ 9 ప్రభాతవార్త : కుప్పం నియోజకవర్గంలో ఇదివరకే పాలిహౌస్‌ల నిర్మాణాలు చేపట్టి మరమ్మత్తులకు గురైన పాలిహౌస్ రైతులకు సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో ప్రభుత్వం తరపునసాయం అందిస్తామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు.గురువారం స్థానిక సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సిఒఇ)లో ఉద్యానవన శాఖ, సీడాప్ అధ్వర్యంలో రైతులకు పాలిహౌస్‌ల నిర్మాణాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈకార్యక్రమానికి ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ పి.డి. వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, కుప్పం ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు అతిధులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కుప్పం ప్రాంతంలో రైతులకు అన్నివిధాలా సహాయ సహకారాలను ప్రభుత్వం ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. ఇదివరకే పాలిహౌస్ నిర్మాణాలు చేపట్టి మరమ్మత్తులకుగురైన వాటికి కడ ద్వారా 33శాతం నిధులు ప్రభుత్వం ద్వారా మంజూరుచేస్తామన్నారు. కొత్తగా పాలిహౌస్‌ల నిర్మాణాలు చేపట్టేరైతులకు ఉద్యానవన శాఖ ద్వారా యాభైశాతం రాయితీ అందించడం జరుగుతోందన్నారు. ఎడి పల్లవి, హెచ్‌ఒలు డింపు ప్రియశ్రీ, వింధ్య, రైతులు పాల్గొన్నారు.

## గజ ప్రజా యాప్‌పై విస్తృతంగా అవగాహన

**- జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్**

చిత్తూరు, అక్టోబర్ 9 ప్రభాతవార్త: గజ ప్రజా యాప్‌పై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని డిఆర్ఓ సమావేశభవనంలో గురువారం డిఆర్ఓ మోహన్‌కుమార్ అటవీశాఖ అధికారులతో కలిసి గజ ప్రజా యాప్ డెమోను పరిశీలించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మోహన్‌కుమార్ మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ పంట నష్టంను నివేదించడానికి, పరిహారాలను వేగంగా పొందడానికి ఈ గజ ప్రజా యాప్ సహాయపడు తుందన్నారు. ఈ యాప్‌ను ఉపయోగించి రైతులు తమ పంట నష్టాల వివరాలను ఫోటోలతో సహా నేరుగా ఫోన్ నుండి అప్‌లోడ్ చేయవచ్చునన్నారు. ఇది పంట నష్టం పరిహార ప్రక్రియను వేగవంతం చేస్తుందన్నారు. రైతులు తమ పంట నష్టం వివరాలను నివేదించడానికి ఈ యాప్‌ను ఉపయోగించవచ్చునన్నారు. ఈ యాప్ డెమో కార్యక్రమంలో వైల్డ్‌లైఫ్ ఎక్స్‌పర్ట్ రాకేష్ కల్వ, పలమనేరు డిఆర్ఓ భవాని, సబ్ డివిజనల్ ఫారెస్టు అధికారి వేణుగోపాల్, చిత్తూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పట్టాభి, పుంగనూరు ఫారెస్ట్ ఆఫీసర్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## లారీ ఢీకొని ఇద్దరు దుర్మరణం



పుత్తూరు రూరల్, అక్టోబరు 9 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా పుత్తూరు బైపాస్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల వివరాలు మేరకు... తమిళనాడులోని పొద్దుటూరు ప్రాంతానికి చెందిన మూర్తి గురునాథ్(60), బి.వి.సుబ్రహ్మణ్యం(53) ద్విచక్రవాహనంపై శ్రీకాళహస్తి ఆలయ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ సంఘటన జరిగిందన్నారు. తిరుపతి నుంచి చెన్నై వైపు వెళుతున్న లారీ, పుత్తూరు బైపాస్ వద్ద ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, లారీని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

## పిల్లల పోషణలో తండ్రులు భాగస్వాములు కావాలి: ఎంఎల్‌ఏ



తొట్టంబేడు, అక్టోబర్ 9 ప్రభాతవార్త: నేడు ఆరోగ్య సంరక్షణలో భాగంగా ప్రభుత్వం పోషకాహార మాసోత్సవంను నిర్వహించుటకు తీర్మానించిందని ఈ కార్యక్రమాల్లోనూ, పిల్లల సంరక్షణలోనూ తండ్రులు భాగస్వాములు కావాలని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. తొట్టంబేడు ఆవరణలోని శ్రీకాళహస్తి ఐసిడియస్ కార్యాలయ ఆవరణలో గురువారం నియోజకవర్గ స్థాయి 8వ రాష్ట్ర పోషకాహార మాసోత్సవంలో భాగంగా సిడిపిఓ శాంతి దుర్గ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నేడు ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాల్సి ఉందన్నారు. 'ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దెన్ క్యూర్' ఏదో వచ్చిన తరువాత పరిష్కారం వెతుక్కోవటం కన్నా రాకుండా ముందు జాగ్రత్త ఎంతో అవసరమని ఆయన వివరించారు. సిడిపిఓ శాంతి దుర్గ ఇప్పటి వరకు చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. తెలుగుదేశం నాయకులు మండల అధ్యక్షుడు మునిరాజానాయుడు, రంగినేని చెంచయ్యానాయుడు, జయచంద్ర నాయుడు, కన్నల ప్రతాప్‌రెడ్డి, రవిరెడ్డి జడ్‌పిటిసి అర్చన,మునిరత్నం ఎంపిడిఓ సురేంద్రనాథ్, ఐసిడియస్ సూపర్‌వైజర్ మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్ వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## పవన్‌కు తిరుపతిలో పరిస్థితులపై వినతి



తిరుపతి,అక్టోబర్ 9ప్రభాతవార్త: ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభిమాని, జనసేనపార్టీ ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్ గురువారం జనసేనాని పవన్‌ను కలిశారు. ఈ సందర్భంగా తిరుపతిలో పార్టీ విషయాలపై డిసిఎం అడిగి తెలుసుకున్నారు. పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. మర్యాదపూర్వకంగా కలిసి పార్టీలో పరిస్థితులు వివరించినట్లు కిరణ్ తెలిపాడు.

## నిరాధార ఆరోపణలపై పరువునష్టం దావా

తిరుపతి,అక్టోబర్ 9ప్రభాతవార్త: తిరుపతి కపిలతీర్థం కూడలిలో ఓ హోటల్ నిర్వహణకు సంబంధించి వైసిపి పార్టీ అనుచరులదని, దాన్ని 99సంవత్సరాలకు అక్రమంగా లీజుకు ఇవ్వడం తప్పుపడుతూ సిఎం చంద్రబాబుకు లేఖరాశానని టిడిపి నేత డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం తెలిపారు. ఆ స్థలంలో పేదల ఆకలితీర్చే అన్నాక్యాంటీన్‌ను నిర్వహించి పదిమందికి ఉదారంగా భోజనం పెట్టించేందుకు సహకరించాలని కోరానన్నారు. దీనిపై విచారణ చేసి న్యాయపరంగా చర్యలు తీసుకోవాలని కోరడం తప్ప తనపై అనవసరంగా, దారుణంగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

## నేత్రాల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ

**- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి**




చిత్తూరుహెల్త్, అక్టోబర్ 9 ప్రభాతవార్త: నేత్రాలను సంరక్షించుకోవడానికి ప్రతి ఒక్కరు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి పిలుపునిచ్చారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో గురువారం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ప్రపంచ దృష్టి దినోత్సవం పురస్కరించుకుని మీ కళ్ళను మీరే ప్రేమించండి అనే నినాదంతో ఈ కార్యక్రమంను డిఎంహెచ్ఓ డాక్టర్ సుధారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి శరీరంలో కళ్ళు అతి ముఖ్యమైనవని, కంటిచూపు పోగొట్టుకుంటే జీవితాంతం అంధకారంగా గడుపాల్సి వస్తోందన్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ డిఎస్ అర్పిత మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు నిర్వహించుకోవాలని, చిన్న పిల్లలు తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకుని కంటి చూపు తగ్గకుండా అవసరమైన చికిత్స చేయించుకోవాలని సూచించారు.

**వార్తకు స్పందన**

## అడ్డగోలు ఆక్రమణలపై రెవెన్యూ పరుగులు



తొట్టంబేడు,అక్టోబర్ 9 ప్రభాతవార్త: తొట్టంబేడు మండలంలో 'అడ్డగోలు ఆక్రమణలు పట్టించుకోని అధికారులు' అనే శీర్షికతో ప్రచురితమైన వార్తపై తొట్టంబేడు మండల అధికారులు స్పందించారు. తహశీల్దార్ భారతీ ఆదేశాలతో ఆర్ఐ సుజాత పర్యవేక్షణలో తొట్టంబేడు చెరువు వద్ద పరిస్థితిని సమీక్షించారు. మండలంలోని అధికారులు కలసి సంయుక్త పరిశీలించారు. ఆరోపణలకు గురైన సర్వే నెంబర్ 150ను పరిశీలించారు.ఈ సర్వేలో అధికారుల రికార్డుల ప్రకారం బోరు వేసిన స్థలం ఆక్రమణలకు గురి కాలేదన్నారు. అదివారి సొంత ఆస్తే అన్నారు.ఈ పరిశీలనలో మండల సర్వేయర్, మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్, ఇరిగేషన్ ఎఇఇ నాగరాజు వర్క్ ఇన్స్‌పెక్టర్ సమగ్రంగా సర్వే జరిపారు. ఆక్రమణలు కాలేదన్నారు.

## మహిళపై హత్యాయత్నం!

సత్యవేడు, అక్టోబరు 9 ప్రభాతవార్త: సత్యవేడు మండలం శ్రీసిటీ పరిధిలోని ఇరుగుళం అటవీ ప్రాంతంలో చెల్లెలాంటి బావ మరిది భార్యపై మానవత్వం మరచిన ఓ మానవ మృగం అఘాయిత్యం చేసిన సంఘటన చోటు చేసుకుంది. వరదయ్యపాళెం మండలం వీకేఆర్‌వై కాలనీకి చెందిన దివ్య(20) భర్త ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఆయన తమిళనాడుకు చెందిన చెన్నై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. భర్తను చూసి ఆయనకు గుడ్డలు సామగ్రి అందించి రావడం కొరకు దివ్య తన ఆడబిడ్డ భర్త అయిన గురవయ్యను తోడుగా తీసుకుని వెళ్లారు. గురవయ్య దివ్యను ద్విచక్రవాహనంపై తీసుకుని వెళ్లారు. ఆస్పత్రి ముగించుకుని తిరుగు ప్రయాణం వస్తుండగా శ్రీసిటీపరిధిలోని ఇరుగుళం అటవీ ప్రాంతంలోకి వచ్చారు. వావి వరస మరచిన గురవయ్య చెల్లెలు లాంటి దివ్యపై పడి బలవంతం చేశాడు. శ్రీసిటీ డీఎస్పీ డి.వి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**టిటిడి డిగ్రీకళాశాలలో ప్రవేశాలపై...**

## బోర్డుసభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి ఆరా



టిటిడి డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలపై విద్యార్థినుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి.హాస్టల్ సీట్లు పెంచేలా చర్చిస్తామని తెలిపారు.